క్లుప్తంగా

నేడు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

అంబాజీపేట: మండలంలో ఉన్న ఆవులు, గేదెలకు బుధవారం నుంచి నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న పశువులు ఉన్న పశువులకు పశువైద్య సిబ్బందితో టీకాలు వేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక వెటర్నరీ ఏడీఏ కార్యాలయం పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందించనున్నట్లు ఏడీ ఎల్.అనిత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నేటి నుంచి మార్చి 31 వరకూ గాలికుంటు వ్యాధి టీకాలను అందించనున్నామన్నారు. ఈఅవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఆదిత్యకు సన్మానం



ఆదిత్యకుమార్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మామిడికుదురు: కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కటకంశెట్టి ఆదిత్యకుమార్‌ను పలువురు పార్టీ నేతలు మంగళవారం స్థానికంగా కలసి ఘనంగా సత్కరించారు. అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ ఎండీవై షరీఫ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, ఎంపీటీసీ రావూరి బుజ్జి, పార్టీ నేతలు మిండగుదిటి చిన్ని తదితరులు ఆదిత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ఆదిత్యకుమార్ మరెన్నో పదవులను అధిరోహించాలని అభిలషించారు.

3న ప్రజ్ఞ వికాసం పరీక్ష

కొత్తపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 3న ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ టి.విజయకృష్ణ తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏ పాఠశాలలో విద్యార్థులకు ఆ పాఠశాలలోనే ఉదయం 10 నుంచి 12 వరకూ పరీక్ష జరుగుతుందని తెలిపారు. సీసీఈ మోడల్‌లోనే పరీక్ష ఉంటుందన్నారు. ఏడు సబ్జెక్టులకు మొత్తం 100 మార్కులు ఇస్తారన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మేధావుల ఆధ్వర్యంలో ప్రశ్నపత్రం తయారు చేసినట్టు తెలిపారు. విద్యార్థుల మేధస్సును పరీక్షించుకోవడానికి ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉత్తమ విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో బహుమతులు ఇస్తారన్నారు. పదో తరగతి విద్యార్థులు అందరూ పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

గురుకుల ప్రవేశాలకు ఆహ్వానం

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఇంగ్లిషు మీడియంలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు మార్చి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ సర్టిఫికెట్‌తో బయటకు రావచ్చని వివరించారు. ప్రస్తుతం నాలుగో తరగతి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఆపై తరగతుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

మంచినీటి వనరులను సద్వినియోగం చేసుకోండి

అయినవిల్లి: మంచినీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని మాగాం సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణ అన్నారు. మాగాం పంచాయతీ వద్ద సర్పంచ్ అధ్యక్షతన జలజీవన్ మిషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్లు జి.సురేంద్ర, బి.చందు, బి.వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేటుకూరి సుబ్బరాజు, కన్నీడి సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి ఆరుగురి ఎంపిక

రావులపాలెం: ఇటీవల విడుదలైన ఫలితాల్లో సైనిక్ పాఠశాలలో ప్రవేశం కోసం రావులపాలెం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు స్థానిక తక్షశిల సైనిక్ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన బి.ప్రేమ్‌సంతోష్‌రెడ్డి, బి.జ్యోతిసుప్రియలు తమిళనాడుకి, కె.జ్ఞానేశ్వరరెడ్డి, ఎస్.లాస్యశ్రీలు ఒడిశాకి, ఎస్.రామ్‌సాయిచరణ్ మహారాష్ట్రకు, వి.కోమల్ సూర్య ఆంధ్రప్రదేశ్ సైనిక్ పాఠశాలల ప్రవేశానికి ఎంపికయ్యారని అన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

- గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ
- ఇంటింటా ఫీవర్ సర్వే



సూర్యారావుపేటలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వచ్చే వేసవి దృష్ట్యా ఏర్పడే ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధుల నివారణ, మెరుగైన ఆరోగ్య రక్షణకు అధికారయంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వైరల్ ఫీవర్స్ కట్టడికి గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేస్తోంది. దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తున్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే ద్వారా జ్వరపీడితులను గుర్తించి అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన చోట్ల ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. శీతాకాలం చలి తీవ్రత తగ్గి రోజురోజుకూ వేసవి ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతుండగా, రాత్రిళ్లు చలిగాలులు, తెల్లవారుజామున మంచు ప్రభావం అధికంగా ఉంటోంది. దీంతో వాతావరణ మార్పులతో వైరల్ ఇన్‌ఫెక్షన్ వచ్చే బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైరల్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రధానంగా జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. వైరల్ ఫీవర్ల ఉధృతిని అరికట్టేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోనున్న 23 పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య అధికారులు చర్యలు చేపట్టారు. జ్వరాల వ్యాప్తికి కారణమైన దోమల నిర్మూలనకు డ్రైన్లు, పల్లపు ప్రాంతాల్లో మందులను స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. లార్వాను అరికట్టేందుకు డ్రైన్లలో యాంటీ లార్వా మందులతో ఫాగింగ్ చేయిస్తున్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

జ్వరపీడితులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సాయం అందించేందుకు వైద్య సిబ్బంది ఫీవర్ సర్వేలు చేయిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ఆరోగ్య, ఆశ సిబ్బంది ప్రతి వారం డ్రై డే ద్వారా యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు .చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వీధుల్లో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా గ్రామ సచివాలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్ణీత సమయంలో క్లోరినేషన్ చేయిస్తున్నారు.

ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ



మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్యం పనులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దోమలను అరికట్టేందుకు రోజూ ఫాగింగ్ చేయిస్తున్నాం. డ్రైన్లలో పూడిక తీయిస్తూ పారిశుధ్య చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల వ్యాప్తికి కారణమవుతున్న సెప్టిక్ ట్యాంకు గొట్టాలు డ్రైన్లలో పెట్టడం అరికట్టవలసి ఉంది.

– పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ, ఆలమూరు

రోగులకు మెరుగైన వైద్యం



వాతావరణ పరిస్థితుల వల్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన పారిశుధ్యం, పరిశుభ్రత కోసం అవలంబించవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన పెంచుతున్నాం. జ్వరపీడితులను గుర్తించేందుకు ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు చేయిస్తున్నాం.

– వి.సువర్చల, సీహెచ్ఓ, చింతలూరు

వైభవంగా చిన్నశేష, హంస వాహనోత్సవాలు



చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి

రావులపాలెం: శ్రీ అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్వామివారికి చిన్నశేష, హంస వాహనోత్సవాల సేవలు నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని చిన్న శేషవాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి స్వామికి హంస వాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెం సీతాసమేత పట్టాభి రామాలయంలో వద్ద జరుగుతున్న చతుర్థ సప్తాహంలో భాగంగా మంగళవారం ఆంజనేయస్వామికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆంజనేయస్వామికి గంధ సిందూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.మామిడికుదురులో కొలువుదీరిన విజయదుర్గమ్మ వారి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు పలు ప్రత్యేక పూజలు జరిపించారు.

తాచుపాము హల్‌చల్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికరలోని బి.నరసింహారావు ఇంట్లో మంగళవారం తాచుపాము చొరబడి హల్‌చల్ చేసింది. ఇంట్లో పామును గుర్తించిన వారు అమలాపురంలోని ఫారెస్ట్ శాఖ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఇచ్చిన సూచనలతో ఇంటి యజమానులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫారెస్ట్ సిబ్బంది కోసం వారు ఎదురు చూస్తున్నారు.

రక్తదాన శిబిరం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కొత్తపేట ప్రభుత్వాస్పత్రి సిబ్బంది సేవలు అందించారు. అలాగే దంత, కంటి వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఘనంగా మహాసుదర్శన హోమం

ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

ఆత్రేయపురం: గ్రామంలో రూ.కోట్లతో శ్రీలక్ష్మీవేంకటేశ్వరుని ఆలయం నిర్మించి క్రమం తప్పకుండా ఎనిమిదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్న పాతపాటి కుటుంబ సభ్యులకు స్వామి వారి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆశీర్వదించారు. ఆయన మంగళవారం స్వామిని దర్శించి చైర్మన్ పాతపాటి రమణరాజు, సోదరులు నాగరాజు, రామాంజనేయరాజు కుటుంబ సభ్యులను అభినందించారు. తొలుత ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి పాతపాటి సోదరులు, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ ఎంపీపీ పీఎస్‌రాజు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆశీర్వదించి శాలువతో సన్మానించారు. ఆయన వెంట సీనియర్ పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు ఉన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి గరుడ వాహనోత్సవం, మహాసుదర్శన హోమం తదితర పూజలను ఆలయ చైర్మన్ పాతపాటి రమణరాజు–రాజ్యలక్ష్మి దంపతులు, సోదరులు, కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష హోమం, మహాసుదర్శన అభిషేకం, హోమం తదితర పూలను వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యాన పూజలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శంఖు, చక్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అలాగే గరుడ వాహనంపై స్వామికి గరుడ వాహనోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామివార్ని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆలయ చైర్మన్ రమణరాజు, ఆలయ నిర్వాహకుడు గోరింట వినయ్‌కుమార్‌రాజు, పాకలపాటి వెంకటరాజు, ఆలయ అర్చకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

అన్ని వయసుల వారికీ నడక మంచిది

రూ.2 కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఎమ్మెల్యే పరిశీలన



ఆత్రేయపురంలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: అన్ని వయస్సుల వారికీ నడక మంచిదని, అలాంటి ఆరోగ్యకరమైన నడక.. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగితే మరింత ఆరోగ్యమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో ఊరి మధ్యలో ఉన్న మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ చేపడితే ఆటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటమే కాదు. నడక, వ్యాయామం చేపట్టడానికి కూడా అవకాశం ఉంటుందని ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకునివెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చెరువును పరిశీలించారు. రుడా నిధులతో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు అభ్యర్థన మేరకు ఆత్రేయపురం చెరువు చుట్టూ పార్కు, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ ఖ్యాతి గడించిన పూతరేకులు పుట్టిన ఊరు ఆత్రేయపురం అభివృద్ధికి తామెప్పుడూ ముందు ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పనితీరుకు గర్వపడుతున్నా..

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- గృహసారథులు, కన్వీనర్లకు కిట్ల పంపిణీ



విశ్వేశ్వరాయపురంలో గృహ సారథులకు కిట్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: దేశమంతా స్ఫూర్తిగా తీసుకునే విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు, పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్లిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరుకు గర్వపడుతున్నామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో బీసీ కమ్యూనిటీ భవనంలో నూతనంగా నియమితులైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు మంగళవారం శిక్షణ తరగతులు జరిగాయి. ఎమ్మెల్యే రాపాక పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలు గర్వపడేలా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తుందని అవి ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం గృహ సారథులకు కిట్లను ఎమ్మెల్యే రాపాక అందించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుబ్బల వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, చింతా రాజబాబు, చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, గుబ్బల రమేష్, నల్లి సత్య, దొండపాటి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం

విలియమ్స్ హోకు ఘన నివాళి



కొత్తపేటలో విలియమ్స్ హో విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయుడు, డేవిడ్ తదితరులు

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి అమలు చేస్తున్న 'జగనన్న చేదోడు' పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచిందని మండల టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి వీరాస్వామినాయుడు అన్నారు. మంగళవారం కొత్తపేటలో శ్రీలక్ష్మీదుర్గా టైలర్స్ మండల కో ఆపరేటివ్ సొసైటీ, టౌన్ టైలర్స్ సంఘాలు ఆధ్వర్యాన టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో కుట్టుమెషీన్ సృష్టికర్త 'విలియమ్స్ హో' విగ్రహానికి ఆయా సంఘాల కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సంఘం ప్రధాన కార్యదర్శి చీకట్ల డేవిడ్, టౌన్ సంఘం కార్యవర్గ సభ్యులు దేశంశెట్టి నాగు, సలాది అంజిబాబు, వీరభద్రం, మండల, టౌన్ సంఘాల కార్యవర్గ సభ్యులు, టైలర్లు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక టైలర్ల డేను స్థానిక టైలర్స్ అధ్యక్షుడు మట్టపర్తి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుట్టుమెషీన్ రుపకర్త విలియమ్ హో చిత్రపటానికి నాగాబత్తుల మీరాసాహెబ్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల సుబ్బారావుతో పాటు పలువురు టైలర్లలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పితాని సత్యనారాయణ, నాగేంద్ర, రాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మదర్‌థెరిసా ప్రైమరీ టైలర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా స్థానిక కెనాల్ రోడ్డు సెంటర్‌లో ఉన్న విలియమ్స్ హో విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మండల రైతు అధ్యక్షుడు యాలి శ్రీనివాస్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. టైలర్ల సొసైటీలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం అధ్యక్షుడు యింటి గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ఉంద్రు శ్రీనివాసరావు, కోశాధికారి బత్తుల కల్యాణ్‌చక్రవర్తి కోరారు.

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్‌లో టైలర్ల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మండల శ్రీలక్ష్మి గణపతి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా టైలర్స్ సంయుక్త కార్యదర్శి, మండల శాఖ అధ్యక్షులు కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈటైలర్స్‌డేకు మండలం నలుమూలల నుంచి విచ్చేసిన టైలర్లు కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీనియర్ టైలర్ ప్రభాకరరావును సంఘ సభ్యులందరూ ఘనంగా సత్కరించారు. టైలర్స్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో మంగళవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. మండల టైలరింగ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన టైలరింగ్ మెషీన్ కనిపెట్టిన విలియమ్స్ హో చిత్రపటానికి టైలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సంఘ అధ్యక్షుడు కొల్లు కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ టైలర్‌లు వెంకటేశ్వరరావు, సుబ్బారావు, ఆంజనేయులను సంఘ సభ్యులు సత్కరించారు.

పి.గన్నవరం: శ్రీబాల గణపతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవాన్ని స్థానిక అక్విడెక్టు పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విలియమ్స్ హో విగ్రహానికి పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అమెను సత్కరించారు. సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చొల్లంగి నాగరాజు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి సత్యనారాయణ, కార్యదర్శి గెద్దాడ శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం సెంటర్‌లో టైలర్స్ డేను మంగళవారం ఘనంగా జరిపారు. సీనియర్ టైలర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా టైలర్స్ యూనియన్ నాయకులు వి.సాయిబాబు, కె. శ్రీనివాస్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన టైలర్లకు పింఛన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త రామన్

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హనుమంతరావు



కొత్తపేటలోని ఓ స్కూల్‌లో సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రావులపాలెంలోని ఓ పాఠశాలలో విద్యార్థినులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు



లక్కవరంలో సైన్స్ నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అంబాజీపేట: 1930లో నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి భారత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ అని జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి బీర హనుమంతరావు, హెచ్‌ఎంలు ఏవీడీ ప్రసాద్, మోకా ప్రకాష్‌లు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం, గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలను మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1986 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు చూపరులను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే సైన్స్ చిత్రాల్ని ముగ్గులతో వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని లక్కవరం మంగెన గురయ్య డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ కె.రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు శివన్నారాయణ మాట్లాడుతూ శాస్త్రవేత్త సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని ప్రపంచ దేశాలను అబ్బురపరిచారని పేర్కొన్నారు. అలాగే విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ పీవీ వరప్రసాద్ మాట్లాడుతూ నేడు సైన్స్‌తోనే ప్రపంచం ముందుకు సాగుతుందన్నారు. మార్చి 5వ తేదీ వరకూ జరిగే వారోత్సవాల్లో వివిధ పోటీలు, వ్యాస రచనల కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే లక్కవరం ప్రగతి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 400 మందికిపైగా విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. కరస్పాండెంట్ గోడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈతకోటలో..

రావులపాలెం: మండలంలోని ఈతకోట జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సైన్సు డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసి వివిధ సైన్సు ప్రాజెక్టులను ఎగ్జిబిషన్‌గా ప్రదర్శించారు. అలాగే సైన్సు ముగ్గుల పోటీలను నిర్వహించి విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. స్థానిక శ్రీసిద్ధార్థ స్కూల్‌లో జాతీయ సైన్సు డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సైన్సు నమూనాలు ప్రదర్శించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: పాఠశాలల్లో సైన్స్ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు, రిటైర్డ్ హెచ్‌ఎం కంచుస్తంభం వీరన్నబాబు ఆశీర్వదించారు. బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్‌డే నిర్వహించారు. దీనిలో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అబ్దుల్ కలాం బ్లాకును పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం కంచుస్తంభం వీరన్నబాబు, సీవీ రామన్ బ్లాకును పాఠశాల హెచ్‌ఎం శర్మ ప్రారంభించారు. ఆ పాఠశాలలో 100 కు పైగా సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించగా ఆ సైన్స్ ప్రయోగాలు స్థానికులు, సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కాజీ నారాయణరావు, సైన్స్ ఉపాధ్యాయులు అవిడి సాంబశివరావు, ఎస్.సత్యానందకుమార్, ఎం.శ్రీనివాసరావు, బీపీ శంకరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఇందిరాబాయి ఆధ్వర్యంలో బాలికలు సైన్స్ నమూనాలు రూపంలో ముగ్గులు పెట్టారు. అలాగే కాంతిభారతిలో కరస్పాండెంట్ టి.సత్యవాణి, స్థానిక సిద్ధార్థ స్కూలులో కరస్పాండెంట్ ఏవీవీ సత్యనారాయణ, భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావు, చాంప్స్ ప్రిన్సిపాల్ కె.దేవి, ఆక్స్‌ఫర్డ్ డైరెక్టర్ ఆర్.గోపీనాథ్‌ల ఆధ్వర్యంలో ఆయా స్కూళ్ల బాలలు సైన్స్ నమూనాలు ప్రదర్శించారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు



మామిడికుదురులో విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు

మామిడికుదురు: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సీవీ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి వాటిని ప్రదర్శించారు. దీనిలో భాగంగా స్థానిక దీప్తి పాఠశాలలో విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రాజెక్టులను రూపొందించారు. విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు వీటిని రూపొందించారు.

రాజోలులో..

రాజోలు: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని బి.సావరం శోభన స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనను రాజోలు ఎస్సై కృష్ణమాచారి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను అధికారులు వీక్షించారు. సర్పంచ్ కడియం రమాదేవి, కరస్పాండెంట్ ఫాదర్ కె.జోసఫ్, ఫాదర్ మార్కో, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, రమ్య, ఉప సర్పంచ్ రావూరి నాగబాబు పాల్గొన్నారు.